ప్రజాశక్తి

మంగళవారం 8 నవంబర్ 2022

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ప్రధాని విశాఖ షెడ్యూల్ ఖరారు

◆ 11న సాయంత్రం 7.30కి నగరానికి రాక ◆ తూర్పునౌకాదళం చోళాలో రాత్రి బస
◆ 12న ఎయులో సభ, పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విశాఖ పర్యటన సోమవారం సాయంత్రం 5.30 గంటలకు ఖరారైంది. ఈ నెల 11న సాయంత్రం 5.30 గంటలకు మధురై ఎయిర్‌పోర్టు నుంచి విశాఖకు ఆయన చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో తూర్పు నౌకాదళంలోని ఐఎన్ఎస్ చోళాకు బయల్దేరుతారు. అక్కడే రాత్రికి బస చేస్తారు. అదే రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి, రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ కూడా విచ్చే స్తున్నారు. వారు కూడా నౌకాదళంలోనే వేర్వేరుగా బస చేసే అవకాశాలున్నాయి. ఆ రోజు రాత్రికి దేశ ప్రధాని మోడీతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ భేటీ అవుతారని తెలుస్తోంది.

ప్రధాని సభకు సిద్ధమవుతున్న ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానం

షెడ్యూల్ ఇలా..

11న సాయంత్రం 5.30 గంటలకు ప్రధాని మధురై ఎయిర్‌పోర్టులో బయల్దేరి విశాఖకు 7.30 గంటలకు రానున్నారు. తూర్పునౌకాదళంలోని చోళాకు అక్కడ నుంచి వెళతారు. 8 గంటల నుంచి అక్కడే నైట్‌హాల్ట్. 12న ఉదయం 10 గంటలకు తూర్పునౌకాదళం నుంచి నేరుగా ఎయు గ్రౌండ్స్‌కు 10.30 గంటలకు రోడ్డు మార్గంలో వస్తారు. 10.30 గంటల నుంచి 11.45 వరకూ పలు ప్రాజెక్టులకు ఫౌండేషన్ స్టోన్ వేయనున్నారు. 11.45 గంటలకు ఐఎన్ఎస్ చోళాకు బయల్దేరతారు. 12 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఎఎఫ్) విమానంలో బేగంపేట ఎయిర్‌పోర్టుకు 1.10 నిమిషాలకు చేరుతారు.

పిఎం అజెండాలో లేని భోగాపురం ఎయిర్ పోర్టు

12న ప్రధానమైన కార్యక్రమాల్లో ప్రధాని మోడీ పాల్గొంటారు. వాటిలో భోగాపురం ఎయిర్‌పోర్టు శంకుస్థాపన అంశం లేదు. ప్రధానమంత్రి కార్యాలయం ఈ అంశాన్ని తర్వాత

మిగతా 2లో..

2.50 లక్షల పైచిలుకే

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల నమోదు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల నమోదు భారీ స్థాయిలో జరిగింది. అక్టోబర్ 1 నుంచి నవంబర్ 7 వరకూ జరిగిన పట్టభద్రుల ఓట్ల నమోదుకు సోమవారం తుది గడువుకాగా 2.50 లక్షలకు పైచిలుకే నమోదైనట్లు కలెక్టరేట్ యంత్రాంగం వెల్లడించింది. రాత్రి 9.30 గంటల వరకూ ఈ లెక్క తేలనందున అంతకు ముందురోజు అంటే ఆదివారం నాటికే లక్షా 86 వేల మంది ఓటర్లుగా ఉత్తరాంధ్ర జిల్లాలు ఆరు చోట్ల నమోదు చేసుకోవడంతో చివరి రోజు సోమవారానికి 2.50 లక్షలకుపైగా ఆ సంఖ్య ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

బట్టల దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం

అగ్ని ప్రమాదంలో కాలిపోయిన దుస్తులు

ప్రజాశక్తి - అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర థియేటర్ ఎదురుగా ఉన్న దొడ్డి అప్పారావు బ్రదర్స్ హోల్‌సేల్ బట్టల దుకాణంలో సోమవారం ఉదయం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో రూ.కోటీ 50 లక్షల విలువైన బట్టలు దగ్ధమయ్యాయి. తెల్లవారుజాము ఐదు గంటల సమయంలో ఈ బట్టల దుకాణం నుంచి పొగ రావడంతో కార్తీక మాస పూజలకు వెళ్తున్న భక్తులు గమనించి ప్రమాద విషయాన్ని అగ్నిమాపక శాఖ సిబ్బందికి తెలియజేశారు. దీంతో వారు హుటాహుటిన వాహనాలతో తరలివచ్చి మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే షాపులో ఉన్న మొత్తం బట్టలు దగ్ధమయ్యాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్టు అగ్నిమాపక శాఖ సిబ్బంది తెలియజేశారు. మరో రెండు నెలల్లో సంక్రాంతి సీజన్ నేపథ్యంలో భారీగా బట్టల స్టాకును ఈ షాపులో తెచ్చిపెట్టారు. స్థానిక శాఖ వీధిలో ఉంటూ పది సంవత్సరాలుగా దొడ్డి అప్పారావు బ్రదర్స్ ఈ బట్టల దుకాణం నిర్వహిస్తున్నారు. స్థానిక మెయిన్ రోడ్డులో

మిగతా 2లో..

నేవల్ బేస్ నిర్వాసితుల సమస్యలు పట్టవా ?

▶ వార్త మెయిన్‌లో..

సరికొత్తగా గోకుల్ పార్కు

▶ వార్త 2లో..

ప్రతిష్టాత్మకంగా ప్రధాని సభ : మంత్రి అమర్‌నాథ్

▶ వార్త 2లో..

అనకాపల్లిలో రమేష్ చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న లోకనాథం, శంకరరావు తదితరులు

రమేష్ ఆశయ సాధనకు కృషి

వర్థంతి సభల్లో సిఐటియు, సిపిఎం నాయకులు
విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పలుచోట్ల కార్యక్రమాలు

వార్త 8వ పేజీలో

నిర్బంధం తగదు : సిపిఎం

ప్రధాని పర్యటన నేపథ్యంలో కార్మిక సంఘాల నాయకులకు నోటీసులు ఇవ్వడం దారుణం

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : ప్రధాని నరేంద్ర మోడీ విశాఖపట్నం పర్యటన సందర్భంగా కార్మికులను, ప్రజలను భయపెట్టే విధంగా పోలీసులు ముందస్తు నోటీసులు పేరుతో 149 సిఆర్‌పిసి సెక్షన్ల కింద నోటీసులు ఇవ్వడాన్ని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఓ సంయుక్త ప్రకటనలో సోమవారం తీవ్రంగా ఖండించారు. ప్రధాని పర్యటన ఈ నెల 11, 12 తేదీల్లో ఉన్నందున విశాఖపట్నంలో ఎటువంటి నిరసనలూ చేపట్టరాదని, వినతిపత్రాలు ఇవ్వకూడదని పోలీసులు ముందస్తు నోటీసులు ఇస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న కార్మిక సంఘాల నాయకులకు, సాధారణ కార్మికులకు, రాజకీయ పార్టీల నాయకులకు, కార్యకర్తలకు ఈ నోటీసులు జారీ చేస్తున్నారని చెప్పారు. ప్రధాని పర్యటనకు ఆటంకంగా ఉంటే కఠినమైన చర్యలు తీసుకుంటామని బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. వాస్తవానికి విశాఖపట్నంతో పాటు తెలుగు ప్రజలు మొత్తం విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఉపసంహరించుకుంటున్నట్టు మోడీ విశాఖపట్నంలో ప్రకటించాలని కోరుకుంటున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్‌తో పాటు ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయొద్దని, ఆంధ్ర రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారని తెలిపారు. విశాఖపట్నం కేంద్రంగా వాల్తేరు డివిజన్‌తో కూడిన రైల్వేజోన్ ప్రకటించాలని, వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలకు అభివద్ధి నిధులు మంజూరు చేయాలని, రాజధాని నిర్మాణానికి, పోలవరం నిర్మాణానికి అయ్యే ఖర్చులను పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరించాలని, విశాఖలోనూ, ఆంధ్ర రాష్ట్రంలోనూ ఏర్పాటు చేస్తానని చెప్పిన ఉన్నత విద్యాసంస్థలను వెంటనే ఏర్పాటు చేయాలని, తదితర డిమాండ్లను నరేంద్ర మోడీ దృష్టికి తీసుకువచ్చి విశాఖ బహిరంగ సభలో వీటన్నింటినీ అమలు చేస్తానని మోడీ ప్రకటిస్తారని వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రధానిని ఒత్తిడి చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు.

రాష్ట్ర ప్రజల హక్కులను మోడీ ప్రభుత్వం దగ్గర తాకట్టు పెడుతోందని చెప్పారు. తాజాగా మోడీ విశాఖ వస్తున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విశాఖలోని కార్మిక సంఘాల నాయకులను, రాజకీయ పార్టీల నాయకులను, సాధారణ ప్రజలను ముందస్తు నోటీసులు పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తూ ముందస్తు అరెస్టులు చేయడానికి సిద్ధపడుతోందని విమర్శించారు. అటువంటి చర్యలను జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

సరికొత్తగా గోకుల్ పార్కు

మేయర్ హరివెంకట కుమారి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రజల సందర్శనార్థం గోకుల్ పార్కును ఆధునికీకరించామని జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. రూ.30.50 లక్షలతో ఆధునికీకరించిన ఆర్కే బీచ్‌లోని గోకుల్ పార్కును ఆమె సోమవారం జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు, ఎంఎల్‌సి వంశీకృష్ణ శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ శ్రీ కృష్ణుని పిల్లని గ్రోవితో ఆర్చ్, బనియన్ ట్రీతో రాధా కృష్ణులకు నీడ, సందర్శకులు కూర్చునేందుకు సిమెంటు బెంచీలు, బీచ్ వైపు ఉన్న పిల్లర్ల మరమ్మతులు, పెయింటింగ్, ఫ్లోరింగ్, విద్యుత్ మొదలైన పనులను పార్కులో చేపట్టామన్నారు. కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు పిన్నింటి వరలక్ష్మి, పల్లా శ్రీను, కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు, జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు ఒమ్మి సన్యాసిరావు, మాజీ అధ్యక్షులు భరణికాన రామారావు, ప్రధాన కార్యదర్శి మొల్లి అప్పారావు, వైసిపి సీనియర్ నాయకులు గొలగాని శ్రీనివాస్, జోనల్ కమిషనర్ చక్రవర్తి పాల్గొన్నారు.

గోకుల్ పార్కు ఆర్చిని ప్రారంభిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్

ఘనంగా రాధాకృష్ణుల మహోత్సవం

గోకుల్ పార్కులో రాధాకృష్ణుల మహోత్సవం ఘనంగా జరిగింది. జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. శ్రీకుష్ణున్ని పూజించారు. వేడుకల్లో పాల్గొన్న వారిలో పార్లమెంట్ సభ్యులు జివిఎల్ నరసింహారావు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా కలెక్టర్ మల్లికార్జున, అప్పన్న ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు, గొంప చంద్రమౌళి, రవి కుమార్ ఉన్నారు.

రాష్ట్ర ప్రయోజనాలపై..

మోడీ స్పష్టమైన ప్రకటన చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈ నెల 11, 12 తేదీల్లో విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని మోడీ రాష్ట్ర ప్రయోజనాలపై స్పష్టమైన ప్రకటన చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టుకు నిధుల విడుదల, రైల్వేజోన్ కార్యకలాపాలు ప్రారంభం, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాజధాని నిర్మాణానికి నిధులు, గిరిజన విశ్వవిద్యాలయం వంటి అంశాలపై కేంద్రం తాత్సారం చేస్తోందని అన్నారు. లాభాల బాటలో ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయాలన్న ప్రయత్నాన్ని ముమ్మరం చేశారని, ఈ ప్రతిపాదనను అంగీకరించే ప్రసక్తే లేదని, ప్లాంట్ నిర్వహణకు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించకుండా మోడీ ప్రాపకానికి తంటాలు పడుతోందని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ చరిత్రను గుర్తుచేశారు. సెయిల్‌లో విలీనం చేయాలని కోరుతున్నట్టు బిజెపి నేతలు చెబుతున్నారని, దాన్ని కూడా అంగీకరించేది లేదని తేల్చిచెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించుకుంటూపోతే అణగారిన తరగతులకు రిజర్వేషన్లు అమలుచేసే పరిస్థితి ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్వాసితుల సమస్యలు ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉన్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టు నిధులను రకరకాల కారణాలతో కేంద్రం ఇవ్వడంలేదని విమర్శించారు. 2019లో విశాఖ రైల్వే మైదానంలో జరిగిన బహిరంగసభలో రైల్వే జోన్‌పై ప్రధాని మోడీ ప్రకటన చేసారని, ఇప్పటి వరకు జోన్ కార్యకలాపాలు ప్రారంభంకాలేదని అన్నారు. జోన్ కార్యాలయానికి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో కార్యకలాపాలు ఎప్పుడు ప్రారంభిస్తారో చెప్పాలన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీలను అమలు చేయడం లేదన్నారు. ప్రధాని సభ పేరుతో ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో చెట్లు నరికివేసి పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఎ.విమల, సిఎన్.క్షేత్రపాల్ పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

ప్రధాని విశాఖ షెడ్యూల్ ఖరారు

అంటే మరలా విశాఖకు వచ్చిన సందర్భంలో చేపట్టాలని భావిస్తోంది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ విషయంపై ఈ దఫా ఎలాంటి ప్రకటన చేస్తారన్నది మోడీ వైపు ఈ ప్రాంత ప్రజలు చూస్తున్నారు. బిజెపి నేతల నుంచి వెల్లడవుతున్న సమాచారం ప్రకారం.. స్టీల్‌ప్లాంట్‌పై మోడీ అంతిమంగా సానుకూలంగా ఉండొచ్చు అంటూ పలువురు తాజాగా వ్యాఖ్యానిస్తున్నారు. సెయిల్‌లో మెర్జింగ్ కార్యక్రమం ఉంటుందని, అయితే ఇంకోసారి విశాఖకు మోడీ వస్తారని, అప్పుడు భోగాపురం ఎయిర్‌పోర్టు, స్టీల్‌ప్లాంట్ అంశాలు అజెండాలో ఉంటాయని చెబుతున్నారు. ఎయు ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో భారీ ఎత్తున ప్రధాని సభకు ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం, ఎయు యాజమాన్యం చేపడుతోంది. అక్కడ నుంచే సుమారు ఆరు ప్రాజెక్టులను వర్చ్యువల్‌గా ప్రధాని ప్రారంభించనున్నారు. హెచ్‌పిసిఎల్ రిఫైనరీ విస్తరణ కోసం జరిగిన పనులతో పూర్తయిన ప్రాజెక్టును ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభించనున్నారు. ఆనందపురం మండలం గంభీరంలో పూర్తయిన ఐఐఎం భవనాన్ని ఇక్కడ నుంచే ప్రారంభిస్తారు. సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌కు శంకుస్థాపన కూడా వర్చ్యువల్‌గా చేపడతారు. స్టేషన్ డవలప్‌మెంట్ ప్రాజెక్టు పనులను కూడా మోడీ ప్రారంభించే అవకాశాలున్నాయి.

బట్టల దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం

ఉన్న సౌత్ సెంట్రల్ షాపింగ్ మాల్ కూడా వీరిదే కావడం విశేషం. దుకాణానికి ఇన్సూరెన్స్ చేయకపోవడంతో భారీగానే నష్టం వాటిల్లినట్టు దుకాణ యజమాని అప్పారావు తెలిపారు. పండగ ముందు ఇంత పెద్ద నష్టం జరగడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

అనకాపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న అమర్‌నాథ్

ప్రతిష్టాత్మకంగా ప్రధాని సభ : మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి - అనకాపల్లి, నర్సీపట్నం టౌన్, పెందుర్తి

రెండు రోజుల పర్యటన నిమిత్తం విశాఖకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోడీకి సాదర స్వాగతం పలకడానికి సన్నాహాలు చేస్తున్నామని, ప్రధాని సభను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశించారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. ప్రధాని మోడీ సభ విజయవంతం చేయడానికి అవసరమైన ఏర్పాట్లను ఆయన సోమవారం సమీక్షించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని ముఖ్య నాయకులతో ఆయన సమావేశమై ఆయా బాధ్యతలను నాయకులు అప్పగించారు. పెందుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అదీప్ రాజ్, నర్సీపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్, పాయకరావుపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే బాబూరావు అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో అమర్‌నాథ్ పాల్గొని ప్రధాని సభ విజయవంతానికి దిశా నిర్దేశం చేశారు. అనకాపల్లిలో జరిగిన సమావేశంలోనూ ఆయన మాట్లాడారు. 12వ తేదీన ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో జరిగే బహిరంగ సభలోనే విశాఖ జిల్లాలోని సుమారు పది వేల కోట్ల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని తెలియజేశారు. సుమారు 5 వేల కోట్ల రూపాయలతో నిర్మించనున్న భోగాపురం ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన చేయడానికి అవకాశాలను పరిశీలించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని చెప్పారు. ప్రధాని సభను రాజకీయపరంగా చూడద్దని, గౌరవంగా చూడాలని వివిధ పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. ప్రధాని కార్యక్రమాలన్నీ నిర్ణీత సమయాలకే జరుగుతాయని, అందువల్ల ఈ సభకు హాజరయ్యే జనం సభా కార్యక్రమానికి రెండు గంటల ముందే వేదిక వద్దకు చేరుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

జాతీయ చెస్ పోటీల్లో నైనాకు రజతం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హర్యానాలో జరిగిన జాతీయ అండర్-11 బాలికల చెస్ పోటీల్లో విశాఖకు చెందిన గొర్లి నైనా రజత పతకం సాధించింది. దేశ వ్యాప్తంగా 131 మంది పాల్గొన్న ఈ టోర్నీలో 66 మంది రేటెడ్, అన్‌రేటెడ్ క్రీడాకారులు పాల్గొన్నారు. 11 రౌండ్‌లలో ప్రత్యర్థులతో పోరాడి 8.5 పాయింట్లను సాధించి నైనా రజత పతకం కైవసం చేసుకుంది. అద్భుతమైన ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి పతకం అందించిన నైనాకు చెస్ సంఘం ప్రతినిధులు కెవివి.శర్మ, మణికంఠ, బాబూరావు, శ్రీకాంత్ అభినందనలు తెలిపారు.

విపక్షాలపై అణచివేత తగదు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విపక్షాలపై వైసిపి ప్రభుత్వ అణచివేత తగదని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ విశాఖపట్నం పర్యటనను విజయవంతం చేయడానికి తమ పార్టీ శ్రేణులంతా సిద్ధంగా ఉన్నాయని అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ఇంతకాలం ఎన్నో పథకాలకు నిధులు ఇచ్చిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పరంగా ఏ అభివృద్ధి ఎపిలో జరగలేదన్నారు. ప్రతి నెలా అప్పులు చేస్తేగానీ జీతాలు కుడా ఇవ్వలేని స్థితిలో జగన్ ప్రభుత్వం ఉందన్నారు.

ఎంపికైన విశాఖ జిల్లా క్రీడాకారులు

ఎపి టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌కు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఎపి స్టేట్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల బాలురు, బాలికల జట్ల ఎంపిక విశాఖపట్నంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగింది. రెండు జిల్లాల నుంచి చెరో 20 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైన వారంతా ఈ నెల 10 నుంచి 13 వరకు గుంటూరులో జరిగే ఎపి స్టేట్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి డివిఎస్‌వై.శర్మ తెలిపారు. క్రీడాకారుల ఎంపిక కమిటీ సభ్యులుగా డివిఎస్‌వై.శర్మతోపాటు అనకాపల్లి జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు, జిల్లా అసోసియేషన్ సభ్యులు వివిఎస్ఎన్.మూర్తి, శేఖర్, మురళి, ధనరాజ్, కన్నబాబు ఉన్నారు.

విశాఖలో ఐక్య చిత్ర ప్రచారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కెఎల్‌పి మూవీ బ్యానర్‌లో నూతన నటీనటులు, సీనియర్ నటులు సుమన్, సత్యప్రకాష్‌లతో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి కీలక పాత్రలో నిర్మించిన ఐక్య చిత్ర ప్రమోషన్ కార్యక్రమాన్ని ఎంవిపి కాలనీలో ఉన్న ఐఐఎం కళాశాలలో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి హాజరయ్యారు. హీరో సాయి చరణ్, హీరోయిన్స్ పల్లవి, ఝాన్సీ పాల్గొన్నారు

హయగ్రీవ నిర్మాణ పనులు నిలిపివేయాలని వినతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : హయగ్రీవ నిర్మాణ పనులను నిలిపివేయాలని, ఎయులోని పచ్చని చెట్ల నరికివేత అన్యాయమని, బాధ్యులుపై చర్యలు తీసుకోవాలని జివిఎంసి 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ జివిఎంసి కమిషనర్ పి.రాజబాబుకు విజ్ఞప్తి చేశారు. సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఈ మేరకు ఆయన వినతి పత్రం అందజేశారు. వార్డు నాయకులు పోతున వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

KANAKADURGA FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
విశాఖపట్నం బ్రాంచి ఆఫీసులు -
NAD కొత్తరోడ్, Opp.భాష్యం స్కూల్ రోడ్డు, గోపాలపట్నం.
లలిత ప్లాజా, ఫస్ట్‌ఫ్లోర్, బోయ్‌లండన్ షాప్ వెనుక, ద్వారకానగర్.
1st ఫ్లోర్, సీతారామనగర్, బిసి రోడ్, న్యూగాజువాక.
బిసి కాలనీ, బాలాజీనగర్, దుర్గమ్మ గుడిదగ్గర, అరిలోవ.

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25.11.2022 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 2260.06 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించుకోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంకట తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
Cell : 8008812798

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL DISTRICT & SESSIONS JUDGE, AT: VISAKHAPATNAM
E.A. 336/2022 in E.P. /2022 in O.S. 233/2012

Between:
M/s. Sai Annapurna Bio-Proteins Private Limited,
Rep. by its Managing Director :
Sri Vemuri Krishna Prasad
...Petitioner/D.Hr

And:
Sajja Radha Krishna,
Proprietor : M/s. Keerthi Enterprises
...Respondent/J.Dr

NOTICE

To,
Respondent/J.Dr:
Sajja Radha Krishna,
S/o. Bhageswara Rao,
Proprietor: M/s. Keerthi Enterprises,
D.No.31-32-81/F6, RK Arcade,
Flat No.B6, Dabagardens,
Visakhapatnam-20
and Residing at D.No.2-175,
Indira Gandhi Nagar, Old Dairy Farm,
Visakhapatnam-40.

Please take notice that the above-named petitioner/D.Hr filed the above petition against you seeking **simultaneous Execution of your arrest for realization of decreetal amount** of **Rs.12,57,37,672/-** and the above E.A.336/2022 stands posted to **22-11-2022** for your appearance. Therefore, you are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **22-11-2022** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law

D. VENKATA LAKSHMI ARRABOLU,
ARRABOLU SAI NAVEEN,
M. KULADEEPIKA ARRABOLU,
Advocates, Visakhapatnam,
Cell: 9440191914.

బాబోయ్ కుక్కలు...

పెరుగుతున్న కుక్క కాటు బాధితులు
మూడు నెలల్లో సిహెచ్‌సిలో 533, పిహెచ్‌సిలో 134 కేసులు నమోదు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శునకాలు గుంపులుగా ఉంటున్నాయి. నడిచి వెళ్లేవారిని గాయ పరుస్తున్నాయి. సైకిళ్లు, మోటారు బైక్‌ల వెంట పడుతున్నాయి. దీంతో భయాందోళన నెలకొంటుంది. కొండపేట హైస్కూల్‌కు వెళ్లే మార్గంలో సోమవారం ఓ విద్యార్థి కుక్క కాటుకు గురయ్యాడు. జివిఎంసి 1, 2 వార్డుల పరిధి బంగ్లామెట్ట, కొండపేట, విల్సన్‌పేట, ఆదర్శనగర్, వెంకటేశ్వరమెట్ట తదితర ప్రాంతాల్లో ఉదయాన్నే గుంపులుగా శునకాలు ఉంటుండడంతో అటుగా వెళ్లేందుకే భయమేస్తోందని పలువురు చెబుతున్నారు. జివిఎంసి అధికారులు స్పందించి శునకాలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు జరిపి వాటి సంతతిని తగ్గించాలని, వాటికి యాంటీ రాబిస్ వ్యాక్సిన్ వేయాలని పలువురు కోరుతున్నారు.

పెరుగుతున్న కుక్క కాటు బాధితులు

స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గత మూడు నెలలుగా కుక్క కాటుకు గురైన బాధితుల సంఖ్య పెరుగుతూ ఉంది. సామాజిక ఆరోగ్య కేంద్రం (భీమిలి ప్రభుత్వ ఆసుపత్రి)లో 2022 జులైలో 113, ఆగస్టులో 137, సెప్టెంబర్‌లో 130, అక్టోబర్‌లో 153 కుక్క కాటు కేసులు నమోదయ్యాయి. మండలంలోని తాళ్లవలస పిహెచ్‌సిలో జులైలో 54, ఆగస్టులో 20, సెప్టెంబర్‌లో 33, అక్టోబర్‌లో 27 కేసులు నమోదయ్యాయి.

ఆందోళన వద్దు

కుక్క కాటుకు గురైన బాధితులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కుక్క కరిచిన వెంటనే గాయాన్ని సబ్బు, వేడి నీళ్లతో శుభ్ర పరచాలి. గాయం నుంచి రక్త స్రావం జరగనివ్వాలి. దీని వల్ల రేబిస్ వైరస్ కొంత వరకు బయటకు వస్తుంది. గాయంపై కట్టు కట్టరాదు. సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళాలి. వైద్యుల సలహా మేరకు జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలను కుక్కలకు దూరంగా ఉంచాలి. కుక్కలను రెచ్చగొట్ట కూడదు. కరిచిన కుక్క మంచిదైనా, పిచ్చిదైనా రేబిస్ వ్యాధి రాకుండా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించాలి. కుక్క కాటుకు గురైన బాధితులకు కరిచిన రోజు, మూడో రోజు, ఏడవ రోజు, 28వ రోజు వ్యాక్సిన్ వేస్తాం. ప్రభుత్వ ఆసుపత్రిలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. ఛాతి పైభాగంలో కుక్క కాటు వేస్తే రేబిస్ ఇమ్యునోగ్లోబ్యులైన్ వ్యాక్సిన్ వేస్తాం.

డాక్టర్ డి.సిద్ధార్థ కుమార్
సూపరింటెండెంట్ ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం, భీమిలి

నేరాలు ఘోరాలు

నకిలీ పత్రాలతో స్థలం అమ్మిన ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి -మధురవాడ : నకిలీ పత్రాలు సృష్టించి స్థలం అమ్మకం చేసిన ముగ్గురిని పిఎం.పాలెం పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సిఐ వై.రామకృష్ణ కథనం ప్రకారం... హైదరాబాద్ రామచంద్రపురం చెందిన పోలవరపు పద్మకు మధురవాడ మిథిలాపురి వుడాకాలనీలో సర్వే నెంబర్ 293లో ప్లాట్ నెంబర్ 870, 871 ఉన్నాయి. పద్మ ప్రస్తుతం దుబాయ్‌లో ఉంటున్నారు. కంచరపాలెం కప్పరాడ చెందిన నక్కెళ్ళ రామకృష్ణ ప్రసాద్ టాక్స్ ప్రాక్టీసర్‌గా పనిచేస్తున్నాడు. మిథిలాపురంలో ఉన్న రెండు ఖాళీ స్థలాలను గుర్తించి, నగరంలోని ఒక ఈ సేవ ద్వారా వాటి డాక్యుమెంట్లను సంపాదించాడు. స్థల యజమాని భర్త మృతి చెందినట్లు మరోపత్రం సృష్టించాడు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం చెందిన తోట స్వాతి స్థల యజమాని కూతురుగా సృష్టించారు. వీరితో పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుకు చెందిన కరగాని విష్ణు కూడా చేతులు కలిపాడు. ముగ్గురు కలిసి ఈ స్థలాన్ని రూ. 36 లక్షలకు విక్రయించారు. ఆ మొత్తాన్ని ముగ్గురూ పంచుకున్నారు. ఆ స్థలంలోకి కొత్త వ్యక్తి రావడంతో కాపలాదారుడు భూ యజమానికి ఫిర్యాదు చేశాడు. భూ యజమాని పద్మ ఈ నెల 1వ తేదీన పిఎం.పాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారించి నిందితులు ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించినట్లు సిఐ తెలిపారు.

ద్విచక్ర వాహనాల చోరీ నిందితులు అరెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలో వరుసగా బైకు దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని, అతనికి సహకరించిన మరో ఆరుగురును ద్వారక క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. పార్కింగ్ చేసిన వాహనాలను, బైకు కీ మర్చిపోయిన వాహనాలను లక్ష్యంగా చేసుకుని నిందితులు ఈ చోరీలకు యత్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఎంవిపి పోలీసుస్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రైం డిసిపి నాగన్న ఈ కేసు వివరాలను వెల్లడించారు. సీతంపేట గణేష్ నగర్‌కు చెందిన పిల్లల సునీత ఈ నెల 3న సాయంత్రం ద్వారకా నగర్‌లో ఉన్న ట్రెండ్స్ షాపింగ్ మాల్‌కు తన స్నేహితురాలితో కలిసి సుజుకి మోటారు బైకుపై షాపింగ్‌కు వెళ్లింది. పార్కింగ్ చేసిన తరువాత వాహనం కనిపించలేదు. ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో సుజాత నగర్‌కు చెందిన మడగల విజయ్ కుమార్ ఆర్‌టిసి.కాంప్లెక్స్ దగ్గరలో ఉన్న బార్ అండ్ రెస్టారెంటు దగ్గర బైకును చోరీ చేస్తుండగా సిసి కెమెరాల ద్వారా పోలీసులు సమాచారం తెలుసుకున్నారు. క్రైమ్ ఎడిసిపి గంగాధరం, సిసిఎస్ సూర్య శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ద్వారక క్రైమ్ సిఐ రమణ మూర్తి, ఎస్ఐ నిహార్, సిబ్బందితో కలిసి నిందితున్ని పట్టుకున్నారు. విచారణలో అతడు 20 వాహనాలను చోరీ చేసినట్లు తెలిసింది. వాటిని కూడా స్వాధీనం చేసుకొని అతన్ని అరెస్ట్ చేశారు. విజయ్ కుమార్‌పై ఇప్పటికే 33 కేసులు ఉన్నాయని డిసిపి నాగన్న తెలిపారు.

కారు దగ్ధం

ప్రజాశక్తి -పెందుర్తి : పెందుర్తి మండలం రాంపురం గ్రామం వద్ద కారు దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం... పాలకొల్లు నుంచి అరకు పర్యటనకు కారులో సుమారు 8 మంది వెళ్తున్నారు. రాంపురం బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి కారు ముందు భాగం నుంచి పొగలు రావడంతో డ్రైవర్ అప్రమత్తమై కారులో ఉన్న వారందరినీ కిందకు దించారు. మంటలు రావడంతో చుట్టుపక్కల వారంతా కేకలు వేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు అయితే ఎవరికీ ప్రాణహాని జరగలేదు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

డిఇఎల్ఇడి పరీక్ష ఫీజు గడువు 10

ప్రజాశక్తి - ఆరిలోవ : డి.ఇఎల్.ఇడి 2020 - 22 విద్యాసంవత్సరం సెమిస్టర్ -4, 2019-21 బ్యాచ్‌లో ఫెయిల్ అయిన అభ్యర్థులూ నవంబరు 10వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. రూ.50 అపరాధ రుసుముతో ఈ నెల 14 వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. పరీక్షల వివరాలను ప్రిన్సిపల్‌కు ఈ నెల 15లోగా అందించాలని తెలిపారు. నాలుగు పరీక్షలకు రూ.250, మూడింటికి రూ.175, రెండింటికి రూ.150, ఒక పరీక్షకు రూ.125 చెల్లించాలని పేర్కొన్నారు.

సమస్యలపై మేయర్‌కు వినతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధిలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మేయర్ గొలగాని హరి వెంకటకుమారికి వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ సోమవారం వినతిపత్రం అందజేశారు. మేయర్‌ను ఆమె ఛాంబర్‌లో కలిసి సమస్యలను వివరించారు. భీమిలి, పురపాలక సంఘంగా ఉన్నప్పుడు వేసిన తాగునీటి పైపు లైన్లు తరచూ మరమ్మతుకు గురవుతూ ఉండడంతో తాగు నీటి సమస్య తలెత్తుతుందని పేర్కొన్నారు. పైపు లైన్లు పునరుద్ధరించాలని కోరారు. ఎన్‌టిఆర్ మినీ క్రికెట్ స్టేడియంలో తాగు నీటి సదుపాయం, డ్రెస్సింగ్ రూమ్ ఏర్పాటు చేయాలని, విద్యుత్ సమస్య పరిష్కరించాలని వినతిలో పేర్కొన్నారు. లైట్ హౌస్ నుంచి పోలమాంబ గుడి వరకు తీరం వెంబడి రక్షణ గోడ నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గంటా నూకరాజు పాల్గొన్నారు.

వైభవంగా రాధాకృష్ణ మహోత్సవం

ప్రజాశక్తి- భీమునిపట్నం : సాగర తీరంలోని గోకుల పార్కులో సోమవారం శ్రీ రాధాకృష్ణ మహోత్సవాన్ని నిర్వహించారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మాజీ మంత్రి ఆర్‌ఎస్‌డిపి అప్పల నరసింహరాజు, విఎంఆర్‌డిఎ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, బి.మణిశంకర నాయుడు తదితరులు గోకుల పార్క్‌లోని రాధాకృష్ణుల విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో అందుబాటులోకి వైద్యం

ఎంపిపి వాసురాజు

రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎంపిపి వాసు రాజు

ప్రజాశక్తి-యంత్రాంగం

భీమునిపట్నం : ఫ్యామిలీ ఫిజీషియన్ ఏర్పాటు ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యం అందుబాటులో ఉన్నట్లు ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్యనారాయణరాజు అన్నారు. మండలంలోని టి.నగరపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం అమలు తీరును సోమవారం పంచాయతీ సర్పంచ్ పొట్నూరు ఛాయా గౌతమి, ఎంపిటిసి సభ్యులు పల్లా నీలిమ, డాకమర్రి ఎంపిటిసి సభ్యులు చెల్లూరి నగేష్‌బాబు, మాజీ ఎంపిటిసి సభ్యులు కోరాడ అప్పలనరసయ్యతో కలిసి పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలను కొనియాడారు. పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జునరావు, 104 వైద్యులు శివరామకృష్ణ, ఎఎన్ఎం, ఆశా వర్కర్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. ఎంపిపి ద్వారా రోగులకు మందులు పంపిణీ చేశారు.

వేములవలసలో...

ఆనందపురం : వేములవలస గ్రామపంచాయతీలో సోమవారం ఫ్యామిలీ ఫిజిషన్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వైద్యాధికారి డాక్టర్ కోరాడ శైలజ వైద్య సేవలందించారు. గ్రామంలో దీర్ఘకాలికంగా బాధపడుతున్న రోగులకు ఇంటి వద్దనే వైద్యం అందించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శైలజ మాట్లాడుతూ, ప్రతినెలా మొదటి సోమవారం వేములవలసలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి, పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ ఐ.గోవిందరావు, ఎఎన్ఎం ఉమ, అంగన్‌వాడీ కార్యకర్త కామాక్షి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సమస్యలపై కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధిలోని దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కమిషనర్ రాజాబాబుకు వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ వినతిపత్రం అందించారు. వార్డులోని వాంబే కాలనీలో ప్రధానంగా భూగర్భ డ్రెయినేజీ సమస్య, బాపూజీ నగర్‌లో తాగునీటి సమస్య, మురుగు పోయే మార్గం లేదని వివరించారు. మిథిలాపురి ఉడా కాలనీలో మురుగు నీరు పోయే మార్గం పనులను ప్రారంభించినా ముందుకు సాగలేదని తెలిపారు. నగరంపాలెం మాస్టర్ ప్లాన్ రహదారి పనులు మూడేళ్ల కిందట ఆగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. వీటిపై దృష్టి సారించి వార్డు అభివృద్ధికి కృషిచేయాలని కమిషనర్‌ను కోరారు.

కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ

వైఫల్యాలకు భయపడొద్దు : ఎయు విసి ప్రసాదరెడ్డి

ప్రజాశక్తి-విశాఖపట్నం : 'అసాధ్యాలను సుసాధ్యం చేసే తరం మీది. వైఫల్యాలను చూసి భయపడకండి. మీ ప్రయత్నాలను మానకండి' అని ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి విద్యార్థులనుద్దేశించి అన్నారు. ఎయు స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ (ఎయూ సిబ్) నూతన బ్యాచ్ తరగతుల ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు.

'అనుబంధ విభాగాలే టిడిపికి పునాది'

ప్రజాశక్తి -భీమునిపట్నం : అనుబంధ సంఘాలే టిడిపి అభివృద్ధికి పునాది అని పార్టీ నియోజక వర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు అన్నారు. భీమిలిలోని పార్టీ కార్యాలయంలో సోమవారం తెలుగు యువత, రైతు, మహిళా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, క్రిస్టియన్, టిఎన్ఎస్ఎఫ్, టిఎన్‌టియుసి తదితర 18 అనుబంధ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2024 ఎన్నికల్లో టిడిపిని అధికారంలోకి తీసుకు రావడమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు పతివాడ రాంబాబు, అనుబంధ విభాగాల అధ్యక్షులు బోయి రమాదేవి, బోర బంగారురెడ్డి, రాంబాబు, ఎం రఘురామరెడ్డి, ఎం.రాజేంద్రప్రసాద్, ఎంవి.గురుమూర్తి, కనకల అప్పలనాయుడు, పోలమ్మ, గణేష్‌రెడ్డి, వంశీ తది తరులు పాల్గొన్నారు. వీరందరినీ సన్మానించారు. టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షునిగా కె.సుమంత్‌ను నియమించారు.

మోడీ పర్యటన నిరసనలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-యంత్రాంగం

ఉక్కునగరం : ప్రధాని మోడీ విశాఖ పర్యటన సందర్భంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పిలుపునిచ్చిన నిరసన కార్యక్రమాలకు కార్మికులు, వారి కుటుంబ సభ్యులు భారీ ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 634వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ సింటర్‌ప్లాంట్ విభాగం కార్మికులు కూర్చున్నారు. ఈ దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, గంధం వెంకటరావు, జె.అయోధ్యరాం, వరసాల శ్రీనివాసరావు, డి.సంపూర్ణం మాట్లాడుతూ, ఈ నెల 11వ తేదీన ఉద్యోగులంతా మాస్ క్యాజువల్ లీవ్ పెట్టాలని తీర్మానించినట్లు వెల్లడించారు. దీక్షా శిబిరం నుంచి చేపట్టేని ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 11వ తేదీ దీక్షా శిబిరంలో ఉక్కు కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, వివిధ మహిళా సంఘాలు దీక్షా శిబిరంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. 12వ తేదీ దీక్షా శిబిరం యథావిధిగా కొనసాగుతుందని, కార్మికులందరూ పాల్గొనాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరించబోమని ప్రధానమంత్రి విశాఖలో ప్రకటన చేయాలని, ఈ మేరకు బిజెపితో సహా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని, ప్రధానికి ఉత్తరాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

దీక్షలో కూర్చున్న సింటర్‌ప్లాంట్ కార్మికులు

కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు సోమవారానికి 585వ రోజుకు చేరాయి. దీక్షల్లో పాల్గొన్న వారిని ఉద్దేశించి హెచ్‌ఎంఎస్ స్టీల్‌ప్లాంట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దొమ్మేటి అప్పారావు మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలన్నారు. ప్రభుత్వ రంగంలోనే ప్లాంట్‌ను కొనసాగించాలన్నారు. దీక్షల్లో యూనియన్ నాయకులు డి.ఈశ్వరరావు, జి.సత్యారావు, బొడ్డు రమణ, జి.అప్పలరాజు, మురళి, నాగేశ్వరరావు, జి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

నిర్వాసిత కాలనీల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- గాజువాక : నిర్వాసిత కాలనీల అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తున్నట్లు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జివిఎంసి 87వ వార్డు పరిధి వడ్లపూడిలో సిసి రోడ్లు, కాలువలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గాజువాక నియోజవర్గానికి చాలా నిధులు కేటాయించారని, ఈ పనులు పూర్తయితే గాజువాక మోడల్ నియోజకవర్గంగా తయారవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గోవిందు, దానప్పలు, దామోదర్ పాల్గొన్నారు.

53వ వార్డులో పట్టభద్రుల ఓటర్ల నమోదు

ప్రజాశక్తి -కంచరపాలెం : జివిఎంసి 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ ఆధ్వర్యాన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ నమోదు చేపట్టారు. పట్టభద్రులకు అవగాహన కల్పించి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో భూష రామలక్ష్మి, అడ్డజంగి కృష్ణ, హనుమంతు రామారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 24వ వార్డు పరిధి పాత రేసపువానిపాలెంలో రూ.20లక్షలతో పలు అభివృద్ధి పనులకు వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి సమక్షంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపల్లి గోవింద్, మాజీ కార్పొటర్ జివి.రమణి, అశోక్ రెడ్డి, బి.గురునాథ రెడ్డి, ఆర్.కష్ణారెడ్డి, బోడిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బి.కష్ణారెడ్డి, కర్రి మురళి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కీర్తిపట్నాయక్‌కు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న యూనివర్సిటీ ప్రతినిధులు

కీర్తి పట్నాయక్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి -మాధవధార : శ్రీదేవి విజ్ఞానజ్యోతి పరిష్కార చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ట్రస్ట్ నిర్వాహకులు కుప్పిలి కీర్తిపట్నాయక్‌కు ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ప్రతినిధులు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కుప్పిలి కీర్తి పట్నాయక్ మాట్లాడుతూ, గత 19 ఏళ్ల నుంచి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని తెలిపారు. తన సేవలకు గుర్తింపుగా డాక్టరేట్‌ను ప్రదానం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తమ సేవలను మరింత విస్తతం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి -ములగాడ : పారిశ్రామిక ప్రాంతంలోని సింధియా నుంచి జింక్ గేటు వరకు ప్రధాన రహదారిలో పారిశుధ్య పనులను జోన్ - 5 ప్రజారోగ్య శాఖ సహాయ వైద్యాధికారి రాజేష్ సోమవారం పరిశీలించారు. ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన హెచ్‌పిసిఎల్‌లో కూడా ఉండడంతో రహదారుల శుభ్రతపై శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు, సూపర్‌వైజర్లకు పలు సూచనలు చేశారు. నిరంతరం రోడ్లు శుభ్రం చేయడంతో పాటు వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలని ఆదేశించారు. ఫుట్ పాత్‌ల పైన, పక్కన చెత్త లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు త్రినాథ్, రవికుమార్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన హెల్త్ ఆఫీసర్ రాజేష్

ఉచిత కంటి పరీక్షలు

విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న శంకర్ ఫౌండేషన్ వైద్యులు

ప్రజాశక్తి -గాజువాక : విద్యార్థులు కంటి పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలని శంకర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ, గ్రూప్ సిఇఒ కెబిఎన్ మణిమాల తెలిపారు. ఎల్ అండ్ టి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సహాయం కింద నాయుడుతోట చెందిన శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుపూరు హైస్కూల్ విద్యార్థులకు సోమవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ అండ్ టి విశాఖపట్నం యూనిట్ అధిపతి శ్రీవాత్సవ మాట్లాడుతూ, శంకర్ ఫౌండేషన్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎల్ అండ్ టి ఎజిఎం శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, శంకర్ ఫౌండేషన్ డిజిఎం బంగారు రాజు, సీనియర్ మేనేజర్ అప్పలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 1700 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. కళ్ళ అద్దాల పంపిణీ చేయనున్నారు.

అదానీ గంగవరం పోర్టు ఆధ్వర్యాన...

అదానీ గంగవరం పోర్టు సిఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా గంగవరం, దాని పరిసర గ్రామాలలో ఉచిత కంటి శిబిరాన్ని నిర్వహించారు. 127 మందికి వైద్యులు కంటి పరీక్షలు జరిపారు. 43 మందికి కళ్ళజోడు అందించారు.

కరాటే ఛాంపియన్ షిప్ బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- కంచరపాలెం : విశాఖలో ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్ షిప్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమరపిని శ్రీనివాసరావు స్మారక సౌత్ ఇండియా కరాటే టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. టోర్నీ చైర్మన్, నెడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ ధర్మాల ఆనంద్ కుమార్‌రెడ్డి, కార్పొరేటర్ కతారి అనీల్ కుమార్‌రాజు మాట్లాడుతూ, క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు టోర్నమెంట్‌లు దోహద పడతాయన్నారు. టోర్నమెంట్ నిర్వాహకులు మల్ల సూర్యారావు, గుండి జానకిరాము మాట్లాడుతూ సుమారు 8 రాష్ట్రాల నుంచి 800 మంది కరాటే క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. బాలురు, బాలికల విభాగాలుగా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.శ్రీనివాస్‌రెడ్డి, అమరపిని నరేంద్ర, మల్లా సుధాకర్, కె.విశ్వేశ్వరరావు, డిపోల రాజు, ఎస్.రంజిత్‌కుమార్, మానేపల్లి పీటర్, గణేష్ మహారాణా, అమరపిని మనోహర్ సాయి, శారద, పూజిత వర్షిత, తదితరులు పాల్గొన్నారు

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కెకె.రాజు తదితరులు

అగనంపూడి విద్యుత్ సమస్యపై వినతి

ప్రజాశక్తి -గాజువాక : అగనంపూడి ప్రాంత విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ ఎల్.మహేందర్‌నాథ్‌కు అగనంపూడి అభివృద్ధి కమిటీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ సోమవారం వినతిపత్రం అందజేశారు. 40,000 మంది నివసిస్తున్న అగనంపూడి కాలనీకి విద్యుత్ సరఫరాలో తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. లో వోల్టేజ్ సమస్య తీవ్రంగా ఉందని వివరించారు. సింగిల్ ఫేస్ నుంచి థర్డ్ ఫేస్‌కు మార్చుతామని చెబుతున్నారు తప్ప నేటికీ అమలుకు నోచలేదని తెలిపారు.

ఆర్మీ అధికారికి నివాళి

ప్రజాశక్తి -కంచరపాలెం : గుండెపోటుతో మృతి చెందిన ఆర్మీ కర్నల్ విజయ్‌భాస్కర్ పార్థివ దేహానికి ఎయిర్‌పోర్టు సిఐ బిఎండి.ప్రసాదరావు సోమవారం నివాళు లర్పించారు. జివిఎంసి 52వ వార్డు పరిధి మర్రిపాలెం ఉడా లే-అవుట్ ప్రాంతానికి చెందిన విజయ్ భాస్కర్ (50) ఆర్మీ కర్నల్ ర్యాంక్‌లో విధులు నిర్వహిస్తున్నారు. గత రాత్రి చెన్నైలో గుండెపోటుతో మృతి చెందారు. అతని భౌతికకాయాన్ని సోమవారం విశాఖకు తీసుకొచ్చి కరాస శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో భాగంగా పలువురు ఆర్మీ జవాన్లతో పాటు ఎయిర్‌పోర్టు పోలీసులు అంజలి ఘటించి నివాళు లర్పించారు.

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి-మాధవధార: మాల ధార చేసిన అయ్యప్ప, భవానీ, వెంకటేశ్వర స్వామి, శివ స్వాములకు మాధవధార సమాజం వద్ద మాధవధార శివ స్వాములచే ఏర్పాటుచేసిన నిత్యాన్నదానాన్ని 50వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సనపల వరప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కఠిన నియమాలను ఆచరించే స్వాముల భిక్షకు అధిక ప్రాధాన్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సంతోష్, రాము, మణిదీప్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తరం'లో కెకె.రాజు గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించే దిశగా ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కార్యాలయానికి విచ్చేసి సమస్యలతో కూడిన వినతిపత్రాలను కెకె.రాజుకు అందించారు. సంబంధిత వినతిపత్రాలను కెకె.రాజు పరిశీలించి, అధికారులతో మాట్లాడి కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్నింటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపల్లి గోవింద్, కార్పొరేటర్లు కె.అనీల్‌కుమార్ రాజు, వార్డు అధ్యక్షులు నీలి రవి, డైరెక్టర్ నూకరాజు, కె.సుశీల, అచ్యుతరావు, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

3,250 కిలోల పిడిఎస్ బియ్యం పట్టివేత

★ రెండు రోజుల తరువాత పోలీసు కేసు
★ అధికార పార్టీకి చెందిన వారు కావడమే అంటున్న స్థానికులు

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని పులపర్తికి చెందిన మహిళ వద్ద 3,250 కేజీల పిడిఎస్ బియ్యాన్ని రెండు రోజుల క్రితం అధికారులు పట్టుకున్నారు. అయినా ఈ వ్యవహారాన్ని రెవెన్యూ వర్గాలు బయటపెట్టలేదు. సోమవారం విషయం తెలిసి విలేకర్లు ప్రశ్నించడంతో వివరాలు వెల్లడించారు. పౌరసరఫరాల అధికారి ఈశ్వరరావు, ఆర్ఐ విష్ణు తెలిపిన వివరాలు ప్రకారం... పులపర్తికి చెందిన పులి అమరావతి వద్ద పిడిఎస్ బియ్యం బస్తాకు 50 కేజీల చొప్పున 65 బస్తాల్లో నిల్వ ఉంచారు. ఈ సమాచారం తెలుసుకున్న పౌరసరఫరా అధికారులు, నిఘా అధికారులు కలిసి సంయుక్తంగా శనివారం దాడి చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకొని గొడౌన్‌కు తరలించారు. బియ్యం నిల్వ ఉంచిన అమరావతిపై 1955 ఇసి యాక్ట్ ప్రకారం యలమంచిలి రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అయితే పట్టుబడిన వ్యక్తి అధికార పార్టీకి చెందిన వ్యక్తి కావడంతో రెండు రోజుల పాటు గుట్టుగా ఉంచినట్లు స్థానికులు చెబుతున్నారు.

పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

వంతెనను పరిశీలిస్తున్న సుగర్ ఫ్యాక్టరీ ఎమ్‌డి సన్యాసినాయుడు

వంతెన మరమ్మతులకు చర్యలు

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఎమ్‌డి సన్యాసినాయుడు

ప్రజాశక్తి - వడ్డాది

ఈ ఏడాది గోవాడ సుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ ప్రారంభించే నాటికి వడ్డాది వంతెనకు మరమ్మతులు చేపట్టే విధంగా అధికారులతో చర్చలు జరుపుతామని గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఎమ్‌డి సన్యాసినాయుడు తెలిపారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాది వంతెనను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు వడ్డాది వంతెన కుంగిపోవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయని తెలిపారు. రానున్న క్రషింగ్ సీజన్ నాటికి వంతెన మరమ్మతులు చేయకపోతే చెరుకు రైతులు పూర్తిగా నష్టపోతారన్నారు. ఏటిలో నీరు ఉధృతం తగ్గిన వెంటనే పనులు మొదలు పెడతామని తెలిపారు. ఆయన వెంట కేన్ ఇన్‌స్పెక్టర్ మధు, అడపా నరసింహమూర్తి, స్థానిక నాయకులు ఉన్నారు.

మాట్లాడుతున్న ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సుబ్బారావు

ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

దేశవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళి సుబ్బారావు డిమాండ్ చేశారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో సోమవారం వియ్యపు రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చలో పార్లమెంటు మార్చ్‌ను నిర్వహిస్తున్నామని, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్‌ను అమలు చేయాలని, ఎన్నికల ముందు నరేంద్ర మోడీ ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు తొత్తులుగా మారిందన్నారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, జిల్లా కార్యదర్శి వి.రాజు, ఉపాధ్యక్షులు డొక్కరి హరీష్, బి.బాలాజీ, రాంబాబు, ఒమ్మి సతీష్, సురేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

9న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని తురకలపూడి జెడ్పీ హైస్కూల్లో అండర్-17 బాల బాలికలకు జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు ఈనెల 9న నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల హెచ్ఎం శంకరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు బాల బాలికలకు వేర్వేరుగా ఈ పోటీలు జరుగుతాయని వెల్లడించారు. ఇక్కడ ఎంపికైన వారు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో జిల్లా తరఫున పాల్గొంటారని పేర్కొన్నారు.

జీతాలు పెంచాలని పంపు ఆపరేటర్ల ఆందోళన

ఎంపిడిఒ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న పంపు ఆపరేటర్లు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

గ్రామాలలో రక్షిత మంచినీటి సరఫరా పథకం ద్వారా తాగునీరు విడుదల చేస్తున్న పంపు ఆపరేటర్లకు జీతాలు పెంచాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఆపరేటర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి కె.సోము నాయుడు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో పంపు ఆపరేటర్లు నిర్దిష్టమైన పనివేళలో లేకుండా నిరంతరంగా సేవలు అందిస్తున్నారని తెలిపారు. వారికి పని కాలానికి తగిన విధంగా జీతాలు ఇవ్వటం లేదన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో విజయలక్ష్మికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జె.అప్పలరాజు, గోవిందరావు, ఎస్ మహాలక్ష్మి నాయుడు, అప్పలస్వామి పాల్గొన్నారు.

సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు, పాల్గొన్న రైతులు

సమగ్ర భూ రీ సర్వేకు రైతులు సహకరించాలి

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని అసకపల్లి పంచాయితీ శివారు ఎరుకునాయుడు పాలెంలో జరుగుతున్న సమగ్ర భూ రీ సర్వేకు రైతులు సహకరించాలని మండల సర్వేయర్ కె.శ్రీనివాసరావు కోరారు. ఎరుకునాయుడు పాలెంలో జరిగిన సర్వే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలతో సర్వేలో పాల్గొని తమ భూ సరిహద్దులను సరిచూసుకోవాలని సూచించారు. ఎరుకు నాయుడుపాలెం రెవెన్యూలోని సర్వే నెంబర్లు 1, 2, 3, 4, 13, 14, 15, 16, 44, 45, 46, 51, 52, 53, 54లలో సర్వే చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కర్రి నర్సింగరావు, ఎంపీటీసీ కర్రి అప్పారావు, రెవెన్యూ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఉప్పవరంలో సర్వే ప్రారంభం

అచ్యుతాపురం : మండలంలోని ఉప్పవరం గ్రామంలో సోమవారం సమగ్ర భూ రీ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా డ్రోన్ సహాయంతో ఏరియల్ సర్వే చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కూనిశెట్టి సత్తిబాబు, మాజీ సర్పంచ్ చిన్ని శ్రీనివాసరావు, పందల శ్రీను, చిన్ని దొరబాబు, మహాలక్ష్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌టిపిసి రైజింగ్ డే వేడుకలు

ప్రజాశక్తి - పరవాడ

పరవాడ సింహాద్రి ఎన్‌టిపిసిలో సోమవారం 48వ రైజింగ్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బెలూన్లు విడుదల, ఎన్‌టీపీసీ పతాకావిష్కరణ చేశారు. చీఫ్ జనరల్ మేనేజర్ జిసి చౌక్సె అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీపీసీ 4 దశాబ్దాలలో 62,910 మెగావాట్స్ విద్యుత్ ఉత్పత్తి సాధించిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి యుఎస్ఎస్‌సిలు, జిఎమ్‌లు, హెచ్ఒడిలు, యూనియన్, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న ఎన్‌టిపిసి చీఫ్ జనరల్ మేనేజర్ చౌక్సె

అథ్లెటిక్స్‌లో వెటరన్ క్రీడాకారుల సత్తా

ప్రజాశక్తి- దేవరాపల్లి

మండలంలోని కాశీపురం, ఎం.అలమండ గ్రామాలకు చెందిన వెటరన్ క్రీడాకారులు అథ్లెటిక్స్‌లో తమ సత్తా చాటారు. ఇటీవల విశాఖలోని పోలీస్ మైదానంలో మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ పోటీల్లో 75 ఏళ్ల పైబడిన విభాగంలో కాశీపురానికి చెందిన ఆదిరెడ్డి చినకన్నబాబు 5కె రన్, వాకింగ్‌తో పాటు షాట్ పుట్, 1500 మీటర్ల, 100 మీటర్ల రన్నింగ్‌లో విజేతగా నిలిచారు. ఇదే గ్రామానికి చెందిన ఆదిరెడ్డి రాంపురి 75 ఏళ్ల పైబడిన విభాగంలో 5కె రన్, 100 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు. 80 ఏళ్ల పైబడిన విభాగంలో కాశీపురానికి చెందిన నెక్కళ్ల దేముడు 5కె నడకతో పాటు 400, 200 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచారు. 45 ఏళ్ల పైబడిన విభాగంలో ఇదే గ్రామానికి చెందిన గడి లక్ష్మి 400, 200 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ స్థానం లోనూ, 5కె రన్, వాకింగ్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఎం.అలమండకు చెందిన అల్లు వెంకటలక్ష్మి 5కె వాకింగ్‌లో మూడో స్థానంలోనూ, 400, 200 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు. విజేతలకు మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు వెంకటాద్రి తదితరులు బహుమతులను అందజేశారు.

విజయ చిహ్నం చూపుతున్న వెటరన్ క్రీడాకారులు

సోషలిజంతోనే దోపిడీకి విముక్తి

ప్రజాశక్తి- కె.కోటపాడు

సోషలిస్టు విధానాలతోనే దోపిడీ నుంచి విముక్తి కలుగుతుందని సిపిఐ మండల కార్యదర్శి జి.దేవుడు బాబు అన్నారు. సోమవారం ప్రపంచ సోషలిస్టు విప్లవ దినోత్సవ సందర్భంగా స్థానిక భవన నిర్మాణ కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోవియట్ విప్లవం నూతన సమాజానికి నాంది పలికిందని, శ్రామిక, పీడిత ప్రజలలో విశ్వాసాన్ని కలిగించిందని పేర్కొన్నారు. నేడు నరేంద్ర మోడీ ప్రభుత్వ హయాంలో దేశం తిరోగమనం వైపు పయనిస్తుందని తెలిపారు. శ్రామికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులపై దాడి జరుగుతుందని, ఈ విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

అర్జీలో సమస్య స్పష్టంగా ఉండాలి

స్పందనలో కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

సమస్యలు వింటున్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి, జెసి కల్పనాకుమారి

ప్రజాశక్తి-అనకాపల్లి

వివిధ సమస్యలపై స్పందనలో అర్జీలు సమర్పించేవారు స్పష్టంగా సమస్య అర్థమయ్యేలా ఉండాలని కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి, డిఆర్‌ఓ వెంకటరమణతో కలిసి ఆయన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్య అర్జీలో స్పష్టంగా ఉంటే అధికారులు పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. దరఖాస్తుకు సంబంధించిన సమాచారం అధికారుల వద్ద 24 గంటల్లో ఉండాలని ఆదేశించారు. సోమవారం స్పందన కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన 199 అర్జీలు వచ్చాయి.

ఎస్పీ కార్యాలయంలో 20 దరఖాస్తులు

జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలకు చెందిన 20 దరఖాస్తులు వచ్చాయి. ఎస్పీ గౌతమి శాలి అర్జీదారుల నుంచి నేరుగా దరఖాస్తులను స్వీకరించారు. చట్ట పరిధిలో సమస్యలను వీలైనంత త్వరలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై ఫిర్యాదు

బుచ్చెయ్యపేట : మండలంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని పేద ప్రజల హక్కుల పరిరక్షణ సంస్థ కార్యదర్శి ఆకుల నాగేశ్వరరావు సోమవారం అనకాపల్లి కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రాజాం గ్రామంలో 80 సెంట్లు ప్రభుత్వ భూమిని ఆక్రమించి 2013లో ఓలం జీడిపిక్కల ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టారని, త్వరలోనే ఫ్యాక్టరీని యాజమాన్యం అమ్మకం చేస్తుందని తెలిపారు. దీనిపై స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గతంలోనే ఫిర్యాదు చేశామన్నారు. అలాగే చింతపాక రెవెన్యూ పరిధిలో రంగురాళ్ల క్వారీకి కేటాయించిన స్థలంతో పాటు సర్వేనెంబర్ 77లోని 20 ఎకరాల భూమిని స్థానిక ప్రజాప్రతినిధులు తుప్పలు తొలగించి ఆక్రమణలు చేపడుతున్నారని పేర్కొన్నారు. ఆక్రమణదారుల నుండి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని అర్హులైన దళితులు, పేద రైతులకు పట్టాలు మంజూరు చేయాలని నాగేశ్వరరావు కోరారు.

ఆందోళన చేస్తున్న అఖిలపక్ష పార్టీల నాయకులు

జాతీయ రహదారుల మరమ్మతులకు ఆందోళన

ప్రజాశక్తి- అనకాపల్లి : నరక కూపాలుగా మారిన జాతీయ రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరుతూ అఖిలపక్షాల ఆధ్వర్యంలో స్థానిక సుంకరమెట్ట జంక్షన్ వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అనకాపల్లి నుంచి విశాఖపట్నం, విజయనగరం వైపు వెళ్లే జాతీయ రహదారులు పూర్తిగా శిథిలమయ్యాయని, ఈ మార్గాల్లో ప్రయాణించాలంటే ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక రోడ్డు ప్రమాదాలు జరిగాయని, తక్షణమే ఆర్ అండ్ బి అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు సూదికొండ మాణిక్యాలరావు, ఆప్ నాయకులు కొణతాల హరినాథ్‌బాబు, సిపిఐ నాయకులు కోన లక్ష్మణ, కాంగ్రెస్ నాయకులు తుట్ట రమణ, రిజర్వేషన్ పరిరక్షణ సమితి నాయకులు వాయబోయిన శేఖర్, భాస్కర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో అన్న సమారాధన కార్యక్రమాలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : కార్తీక సోమవారం సందర్భంగా మండలంలోని పలు గ్రామాలలో సోమవారం అన్నసమారాధన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. చోడమాంబిక ఆలయంలో అయ్యప్ప స్వామి భక్తులకు నిత్యం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తిమ్మరాజుపేట, మోసయ్యపేట గ్రామాల్లోనూ అన్నసమారాధన జరిగింది.

గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు

ప్రజాశక్తి - అచ్యుతాపురం : మండలంలోని హరిపాలెం గ్రామంలో గౌరీ పరమేశ్వర అమ్మవారి వారి సారె ఊరేగింపు కార్యక్రమం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. తిమ్మరాజుపేట గ్రామంలో గౌరీ పరమేశ్వరుల ప్రతిమను గ్రామ పురవీధులలో ఊరేగించారు. మహిళలు కోలాటాల ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామ సర్పంచులు, ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

వన సమారాధనకు ఎంవిఆర్ విరాళం

ప్రజాశక్తి-అనకాపల్లి : కార్తిక మాసం సందర్భంగా కాపు సంక్షేమ శాఖ నిర్వహించే వన సమారాధనకు ముత్యాల గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు తరఫున ఎంవిఆర్ ట్రస్టు రూ.10వేలు విరాళం అందజేసింది. ఎంవిఆర్ యువ సేన సభ్యులు ముద్దుర్తి గ్రామ సర్పంచ్ కడిమి లక్ష్మి వెంకట్, మామిడిపాలెం మాజీ సర్పంచ్ కరణం శ్రీను, ముద్దుర్తి గ్రామ మాజీ సర్పంచ్ గాలి శ్రీనివాస్ చేతుల మీదుగా ఈ రూ.10వేలును అందజేశారు. పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయిలో నాతవరం మండలం తాండవ రిజర్వాయర్ వద్ద జరిగిన ఈ వన సమారాధనకు సుమారు 5 వేల కుటుంబాలు హాజరైనట్లు యువసేన సభ్యులు తెలిపారు. అనంతరం ఎంవిఆర్ యువసేన సభ్యులను సత్కరించారు.

సీజనల్ హాస్టళ్ల నిర్వహణకు ఎన్‌జిఒల నుంచి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : పనుల కోసం వివిధ ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పిల్లల కోసం 2022 -23 విద్యా సంవత్సరానికి సీజనల్ హాస్టళ్ల నిర్వహణకు స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఎస్.రాయవరం, రాంబిల్లి, నాతవరం, గొలుగొండ మండలాల్లో ఈ హాస్టళ్లను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల ఎన్జీవోలు ఈనెల 7 నుంచి 10వ తేదీ లోగా సొసైటీ గుర్తింపు, బైలా, మూడేళ్ల ఆడిట్ రిపోర్ట్, విద్యాపరంగా చేసిన కార్యక్రమాల డాక్యుమెంట్లతో సమగ్ర శిక్ష కార్యాలయంలో దరఖాస్తు చేయాలని సూచించారు.

కాజీపాలెంలో కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి- అచ్యుతాపురం : మండలంలోని కాజీ పాలెం గ్రామంలో సోమవారం శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో విశాఖ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 205 మంది బాల బాలికలకు కంటి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో హరిపాలెం సాయి భజన మండలి కన్వీనర్ కర్రి ఆది నాగేశ్వరరావు, ఎస్.శేఖర్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై

ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలి

సిఐటియు జిల్లా నాయకులు శ్రీనివాసరావు

ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాల్సిన ప్రాంతం ఇదే..

ప్రజాశక్తి - కశింకోట

కశింకోట జాతీయ రహదారిపై పోలీస్ స్టేషన్ వద్ద నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్, డివైడర్ మధ్యలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జాతీయ రహదారి కశింకోట ఊరు మధ్య నుంచి ఉందని, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, బ్యాంకులు, పోస్టాఫీసు, ప్రభుత్వ ఆసుపత్రి, మండల కార్యాలయాలు, పోలీస్ స్టేషన్, రైల్వే స్టేషన్, సంత బజారు, దుకాణాలు వీటిలో ఎక్కడికి వెళ్లాలన్నా జాతీయ రహదారి దాటాల్సి వస్తుందని తెలిపారు. ఆఫీసులకు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే సమయంలో ట్రాఫిక్ మరింత ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమయం రోడ్డు క్రాస్ చేస్తున్నప్పుడు అనేక సందర్భాల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. డివైడర్ మధ్యలో విద్యుత్ దీపాలు లేకపోవడం వల్ల రాత్రి సమయంలో చీకటిగా ఉండటంతో జాతీయ రహదారి దాటడం మృత్యువును చేరుకోవడమే అన్నట్లుగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమస్యపై గతంలో అనేక పత్రికల్లో కథనాలు వచ్చినా అధికారులు స్పందించలేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్, జిల్లా ఎస్‌పి, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ట్రాఫిక్ సిగ్నల్, డివైడర్‌పై విద్యుత్ దీపాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

'ఫ్యామిలీ ఫిజీషియన్'తో మెరుగైన వైద్యం

ప్రజాశక్తి-కశింకోట

ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని వైద్యాధికారి చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని తాళ్లపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద ఫ్యామిలీ ఫిజీషియన్ శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌పిటిసి లగిశెట్టి భవాని, వైసిపి నాయకులు లగిశెట్టి గణేష్, గ్రామ కార్యదర్శి వెంకట లక్ష్మీ సచివాలయం సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చెయ్యపేట మండలం ఎల్‌బిపి.అగ్రహారం, బంగారు మెట్ట, లోపూడి, ఎల్.సింగవరం గ్రామాల్లో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా భాగంగా వడ్డాది పీహెచ్సీ పరిధిలోని లోపూడి సచివాలయంలో 104 వాహన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్‌వి.శకుంతల 135 మందికి పరీక్షలు నిర్వహించి, అన్ని రకాల వ్యాధులకు మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు తమరాన శ్రీనివాసరావు మెరుగు కుమారి బాబూరావు, మధు, కో-ఆపరేటివ్ అధ్యక్షులు సాయం రమేష్, మాజీ సర్పంచ్ ఎస్.నానాజీ వాసు, తమరణ వెంకట రమణ, ఎంపిటిసి యల్లపు జగ్గారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ శకుంతల, పాల్గొన్న సర్పంచ్ తదితరులు

భోజనాలు వడ్డిస్తున్న టిడిపి నేత పైలా ప్రసాదరావు

అన్న సమారాధనకు పైలా విరాళం

ప్రజాశక్తి - కె.కోటపాడు

మండలంలోని ఎ.కోడూరులోని శివాలయంలో కార్తీక సోమవారం సందర్భంగా నిర్వహించిన రుద్రాభిషేకంలో టిడిపి మాడుగుల నియోజకవర్గం నాయకులు పైలా ప్రసాదరావు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు హాజరై రూ.30 వేలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎ.కోడూరు సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు, సింగన్నదొర పాలెం సర్పంచ్ వెలగ పైడం నాయుడు, గుల్లిపల్లి ఎంపిటిసి దేముడు బాబు, కింతాడ మాజీ సర్పంచ్ బండారు నరసింహానాయుడు, టిడిపి నాయకులు పూడి నారాయణ మూర్తి, లెక్కల అవతారమూర్తి, లెక్కల అప్పలనాయుడు, రాళ్లపల్లి దేముడు, సింగంపల్లి ప్రకాష్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తే బంగారు భవిష్యత్తు

ప్రజాశక్తి - దేవరాపల్లి

క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవడంతో పాటు విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించినప్పుడే వారికి బంగారు భవిష్యత్తు ఉంటుందని స్థానిక ఎస్సై డి.నాగేంద్ర అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక ఆధ్వర్యంలో మండలంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాలలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆత్మవిశ్వాసం, పట్టుదలతో మంచి మార్కులు సాధించాలని సూచించారు. కేవలం విద్యతోనే కాకుండా క్రీడల్లో ప్రతిభ కనబరిచి కళాశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. ప్రతి విద్యార్థి రాజ్యాంగం, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. సెల్ ఫోన్ మోజులో పడి, చెడు వ్యసనాలకు గురి కావద్దని హితవు పలికారు. ఐక్యవేదిక మండల అధ్యక్షులు కొరుప్రోలు శ్రీను అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కెవి.రమణ, ప్రిన్సిపాల్ సిహెచ్.రవీంద్రనాథ్, మండల అంబేద్కర్స్ ఇండియా మిషన్ అధ్యక్షులు కాటపల్లి అప్పారావు, కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఐ నాగేంద్ర

రజకుల భూములకు నష్టపరిహారం చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని రాజయ్యపేట గ్రామంలో వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో సేకరించిన రజకుల భూములకు నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. సోమవారం రజకులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం వద్ద నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ సుబ్రహ్మణ్యంశాస్త్రికు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు, రజక సంఘం అధ్యక్షులు పిడిమి వీరన్న మాట్లాడుతూ, 1962 సంవత్సరంలో ఆనాటి ప్రభుత్వం 289/2 సర్వే నెంబర్‌లో రాజయ్యపేట గ్రామంలో గల 9 మంది రజక కుటుంబాలకు 7 ఎకరాల భూమి ఇచ్చిందని, ఆనాటి నుండి ఆ భూములలో రజకులు కుల వృత్తి చేపడుతూ, మిగిలిన భూములలో జీడి మామిడి, కొబ్బరి తోటలు వేసుకుని వచ్చిన ఫలసాయంతో కుటుంబాలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వైజాగ్ - చెన్నై ఇండస్ట్రీల్ కారిడార్ ఏర్పాటుకు ప్రభుత్వం ఏపీఐఐసీ అధికారుల ద్వారా రజకులకు చెందిన భూములు కూడా సేకరించడం జరిగిందన్నారు. వెంటనే అధికారులు స్పందించి రజకులకు చెందిన భూములను సర్వే చేయించి ఆ భూములకు జిరాయితీకి చెందిన భూములుగా పరిగణించి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతీ ఒక్కరికి రూ.25 లక్షల ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రజకులు పొన్నాడ వీర్రాజు, గంగాడ కృష్ణ, పొన్నాడ నాగరాజు, పిడిమి చినతల్లి, పొన్నాడ కొండమ్మ, పొన్నాడ అప్పలనర్స, పొన్నాడ మంగ పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న అప్పలరాజు, రజకులు

ప్రారంభిస్తున్న సిబ్బంది

భూ రీ సర్వే ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కొమిర రెవెన్యూ పరిధిలో రెవెన్యూ అధికారులు డ్రోన్ కెమెరాతో రీ సర్వే పనులు సోమవారం ప్రారంభించారు. ఇన్‌చార్జ్ తహశీల్దార్ ఆనందరావు ఆదేశాల మేరకు సర్వేయర్ చినబాబు ఈ పనులు నిర్వహించారు. ఈ సర్వే పూర్తి అయితే రెవెన్యూ సమస్యలు ఉండవని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమిర సర్పంచ్ రాజుబాబు, చోద్యం సహకార బ్యాంక్ ఛైర్మన్ పెద్దిరాజు, సత్యనారాయణ, రాజుబాబు, వీఆర్వో కుమారి పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై వినతి

ప్రజాశక్తి- నర్సీపట్నం: మున్సిపల్ పరిధి బలిఘట్టం లో బ్రహ్మలింగేశ్వర స్వామి దేవస్థానం వద్ద రాజరాజేశ్వరి పర్వతశ్రేణిపై అక్రమ గ్రావెల్ తవ్వకాలను అరికట్టాలని ఆర్‌డిఒ భవాని శంకర్‌కు భారతీయ జనతా పార్టీ నేత అడిగర్ల సతీష్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అడిగర్ల సతీష్ మాట్లాడుతూ, అధికార పార్టీ నాయకుల అండదండలతో ఈ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని, ఆధ్యాత్మికంగా ఈ పర్వతాలు ఎంతో పేరు ప్రతిష్టలు కలిగి ఉన్నాయన్నారు. అక్రమ తవ్వకాలతో భవిష్యత్తులో పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర సంపర్క అభియాన్ ప్రముఖ్ గాదె శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షులు వెలగా జగన్నాథ్, రూరల్ మండలం అధ్యక్షుడు బోలెం శివ, కోశాధికారి నాగేశ్వరరావు, రవి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాబూరావుకు నిరసన సెగ

నిలదీస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నక్కపల్లి:హెటిరో కాలుష్యంపై ఈ ప్రాంత మత్స్యకారులంతా ఐక్యంగా వస్తే ధర్నా చేద్దామని ఎమ్మెల్యే గొల్ల బాబురావు అన్నారు. మండలంలోని పెద తీనార్ల పంచాయతీ శివారు దొండవాక గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి ఎమ్మెల్యే బాబురావు గ్రామంలో పర్యటిస్తుండగా జనసేన పార్టీకి చెందిన పలువురు యువకులు నిరసన గళం వినిపించారు. హెటేరో కాలుష్యం, గ్రామంలో సమస్యల పైన ఎమ్మెల్యే బాబురావు దృష్టికి తీసుకువచ్చే సమయంలో నాయకులు, పోలీసులు, జనసేన పార్టీ నాయకుల మధ్య కొద్దిపాటి వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో జనసేన పార్టీకి చెందిన యువకులు ఎమ్మెల్యే గో బ్యాక్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. సిఐ నారాయణరావు, ఎస్ఐ శిరీష జనసేన యువకులను వారించారు. అనంతరం జనసేన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మైలపల్లి గిరీష్ తదితరులు ఎమ్మెల్యే తో మాట్లాడి సమస్యలను విన్నవించారు. హెటిరో కాలుష్యం కారణంగా అనేకమంది వ్యాధులను బారిన పడుతున్నారని, పలువురు మీత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, హెటిరో కాలుష్యంపై ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మైలపల్లి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు శీరం నరసింహమూర్తి, తాతారావు, ఏరిపిల్లి నాగేష్, కొర్లయ్య, జనసేన నాయకులు పిక్కి స్వామి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-రోలుగుంట:పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని కొత్తకోట సిఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ తెలిపారు. సోమవారం రోలుగుంట పోలీస్‌స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడారు. చిన్న పిల్లలను పశువులను కాయించినప్పుడు, మహిళలు పొలాల్లో పని చేసినప్పుడు అలసత్వం వహించరాదన్నారు. చిన్నపిల్లలకు సెల్‌ఫోన్ ఇచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా మద్యం తాగి విచ్చలవిడిగా ప్రవర్తిస్తే వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉపమాక శివాలయం వద్ద సోమవారం భారీ అనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. రెండవ సోమవారం పౌర్ణమి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తుల తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుండి ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కిటకటలాడింది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యులు పలు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో శివాలయం ఛైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు, వెంకన్న ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాదాచార్యులు పాల్గొన్నారు.

పేకాట నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి-నక్కపల్లి :మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామ సమీపంలో సోమవారం తెల్లవారుజాము సమయంలో ఎస్ఐ శిరీష తన సిబ్బందితో పేకాట శిబిరంపై దాడి చేశారు. ఈ దాడుల్లో ఆరుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి రూ.1,35,150 లు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శిరీష తెలిపారు. నిరంతరం దాడులు నిర్వహిస్తామని హెచ్చరించారు.

కనీస సౌకర్యాలపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:జగనన్న కాలనీలో మౌళిక వసతులు కల్పించాలని సోమవారం అనకాపల్లి స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కి సోమవారం ఫిర్యాదు చేసినట్లు కొరుప్రోలు గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, తమకు ప్రభుత్వం రెండు సంవత్సరాల క్రితం ఇళ్ళ స్థలాలు కేటాయించిందని, ఇళ్ళ నిర్మాణానికి అవసరమైన నీరు, విద్యుత్, రోడ్లు వంటి మౌళిక సదుపాయాల ఏర్పాటులో జాప్యం జరుగుతుందన్నారు. మౌళిక సదుపాయాల కొరతతో ఇళ్ళ నిర్మాణాలు నిలిచి పోయాయని తెలిపారు.

వినతిపత్రం చూపుతున్న గ్రామస్తులు

'మూడేళ్లలో అభివృద్ధి ఏదీ'?

ప్రజాశక్తి-గొలుగొండ:వైసిపి మూడున్నరేళ్ల పాలనలో కుట్రలు, కుతంత్రాలు, కక్ష సాధింపులకే అధిక ప్రాధాన్యత ఇచ్చిందని, అభివృద్ధి జాడ ఎక్కడ లేదని జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర విమర్శించారు. సోమవారం గొలుగొండలో జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.జనసేన ఆవిర్భావ సభకు పొలాలు ఇచ్చారన్న ఒకే ఒక్క కారణంతో కక్ష కట్టి గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం ఇప్పటం గ్రామ రైతుల ఇళ్లను కూలగొట్టారన్నారు. అక్కడ ఉన్న వారంతా రైతులు. కాయకష్టం చేసుకొని ఇళ్లను నిర్మించుకున్నారన్నారు.బస్సే తిరగని గ్రామంలో 120 అడుగుల రోడ్డెందుకు అని ప్రశ్నించారు. అమర్‌నాథ్ మంత్రి అయ్యాక రాష్ట్రానికి ఎన్ని పరిశ్రమలు తెచ్చారో.. యువతకు ఎన్ని ఉద్యోగాలు కల్పించారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గడ్డం దొరబాబు, నాయకులు రేగుబళ్ల శివ పాల్గొన్నారు.

మాజీ మంత్రి అయ్యన్నకు సంఘీభావం

అయ్యన్నను పరామర్శిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - నర్సీపట్నం రూరల్: మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్న పాత్రుడును సోమవారం నర్సీపట్నంలోని స్వగృహంలో మాజీ మంత్రి, టీడీపీ బీసీ విభాగం అధ్యక్షులు కొల్లు రవీంద్ర, రాష్ట్ర నేత బుద్దా వెంకన్నలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన నడుస్తుందన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం గల అయ్యన్నపాత్రుడుని ప్రభుత్వం అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. వైసిపి ప్రభుత్వం చేస్తున్న తప్పులను నిలదీస్తున్నందుకు అయ్యన్నపై కక్ష కట్టిందన్నారు. ఆయనతో పాటు రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర కుమార్, కైకలూరు టిడిపి సీనియర్ నాయకులు బికేఎం నాని, శెట్టిబలిజ సాధికార కన్వీన ర్ కూడిపూడి సత్తిబాబు, తెలుగు యువత అసెంబ్లీ కన్వీనర్ నాగరాజు, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీష్, రాష్ట్ర బీసీ కన్వీనర్ మళ్ల సురేంద్ర, చోడవరం ఇంచార్జి బత్తుల తాతయబాబు, వేగి పరమేశ్వరావు తదితరులు పరామర్శించి సంఘీభావం తెలిపారు.

అనకాపల్లి : ఇటీవల ఫోర్జరీ సంతకం కేసులో అరెస్టు కాబడి, విడుదలైన తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుని సోమవారం టిడిపి నాయకులు కలసి సంఘీభావం తెలిపారు. అయ్యన్నను కలిసిన వారిలో అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర, అనకాపల్లి జిల్లా నాయకులు పోలవరపు త్రినాథ్, కనిశెట్టి సన్యాసిరావు, శరగడం భాస్కర్ ఉన్నారు.

అచ్యుతాపురం : అయ్యన్నపాత్రుడు సోమవారం అచ్యుతాపురం మండలానికి చెందిన టిడిపి, జనసేన పార్టీ నాయకులు కలిసి సంఘీభావం తెలిపారు. పూడిమడక గ్రామానికి చెందిన టిడిపి నాయకులు అయ్యన్నపాత్రులను గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మెరుగు బాపు నాయుడు, పి కొండబాబు, జనసేన నాయకులు మోటూరు శ్రీ వేణి పాల్గొన్నారు. అలాగే జనసేన పార్టీ నాయకులు సందర్పూర్ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో అయన పాత్రులు కలిసి వారి సంఘీభావం తెలిపారు.

రమేష్ ఆశయ సాధనకు కృషి

వర్ధంతి సభల్లో సిఐటియు, సిపిఎం నాయకులు

మద్దిలపాలెంలో నివాళి అర్పిస్తున్న అజశర్మ, తదితరులు

ప్రజాశక్తి- అనకాపల్లి

సిఐటియు జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి, సిపిఎం జిల్లా మాజీ కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ ఎస్.రమేష్ ఆశయ సాధనకు కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పిలుపునిచ్చారు. స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో సోమవారం రమేష్ ఐదో వర్ధంతి సభ పిఎన్‌వి.పరమేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన లోకనాథం రమేష్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే కామ్రేడ్ రమేష్ వామపక్ష భావాలతో ప్రజల తరపున పోరాటాలు చేశారని గుర్తు చేశారు. అతి చిన్న వయసులోనే రమేష్ మరణించడం పార్టీకి, కార్మిక, అణగారిన వర్గాలకు తీరని లోటన్నారు. నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు, కార్మిక చట్టాల సవరణతో కార్మికులకు, పేద, మధ్య తరగతి వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, నాయకులు ఎం.సూర్యకళ, కనకాల రాజు, మజ్జి శంకర్రావు, పలక సత్యనారాయణ, రెడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసి కార్మికుల పక్ష నాయకునిగా రమేష్ కార్మికుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని సిఐటియు సీనియర్ నాయకులు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ కొనియాడారు. సిఐటియు విశాఖ జిల్లా పూర్వ కార్యదర్శి ఎస్.రమేష్ వర్ధంతి సభ మద్దిలపాలెంలోని సిఐటియు కార్యాలయంలో జరిగింది. తొలుత రమేష్ చిత్రపటానికి అజశర్మ, జివిఎన్.చలపతి, ఆర్‌కెఎస్‌వి.కుమార్‌లు పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రమేష్ విద్యార్థి దశ నుండే పోరుబాటలో పయనించారన్నారు. జిల్లాలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసి వారిని చైతన్యపరిచి ఉద్యమాలకు నాయకత్వం వహించారన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బి.జగన్, చంద్రమౌళి పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

మల్కాపురం : స్థానిక సిఐటియు కార్యాలయంలో రమేష్ వర్ధంతి కార్యక్రమం చేపట్టారు. రమేష్ చిత్రపటానికి సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రమేష్ ఆశయాలను ముందుకు తీసుకుపోవడమే ఆయనకు ఇచ్చే ఘన నివాళి అని అన్నారు. రమేష్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, అధ్యక్షులు కె.పెంటారావు, నాయకులు జగన్నాథరావు, గాంధీ, శ్రీను, శంకరరావు, అప్పాజీ పాల్గొన్నారు.

నక్కపల్లిలో నివాళి

ఆనందపురం : సరిపిల్ల రమేష్ జీవితం ఉద్యమాల స్ఫూర్తి అని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు జి.రమణ పేర్కొన్నారు. మండలంలోని బొడ్డపాలెం రమేష్ భవనంలో సిపిఎం ఆధ్వర్యాన వర్ధంతి సభ నిర్వహించారు. రమేష్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి నాయకులు దల్లి రాంబాబు పలు ఉద్యమ, ప్రజా గేయాలను ఆలపించారు. కె.నాగరాణి, కె.ద్రాక్షాయిని, జి.సుమిత్ర, బి.శరత్చంద్ర, జె.వెంకటరావు, కె.రమణ, శిరీష పాల్గొన్నారు.

అచ్యుతాపురం : కార్మికోద్యమ నేత కామ్రేడ్ ఎస్.రమేష్ ఐదో వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయం ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.రాము, మండల కార్యదర్శి కె.సోమునాయుడు, నాయకులు కనకరాజు, శ్రీను, అబ్బాయి నాయుడు పాల్గొన్నారు.

రాంబిల్లి : మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యాన నిర్వహించినరమేష్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి జి.దేముడునాయుడు మాట్లాడుతూ రమేష్ నాడు నేవీ నిర్వాసితుల పోరాటంలో పాల్గొని వారి వాణిని జిల్లా అంతటా వినిపించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నేతలు బద్ది భాస్కరరావు, సిహెచ్.గంగరాజు, ఎస్.నారాయణరావు, సిహెచ్.నూకన్న, కాశి, నాగబాబు, అప్పలరాజు, ఎర్రయ్య, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురంలో నివాళి అర్పిస్తున్న జగ్గునాయుడు

పరవాడ : మండలంలోని ఫార్మాసిటీలో నిర్వహించిన రమేష్ వర్ధంతి సభలో ఆయన చిత్ర పటానికి సిఐటియు జిల్లా కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కర్రి వెంకయ్య నాయుడు, ఆడారి రాజు, కర్రి పెంటారావు, బి.రాము, కె.కృష్ణ పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక దుర్గమాంబ ముఠా కళాసీ సంఘం కార్యాలయంలో జరిగిన రమేష్ వర్ధంతి సభలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి హాజరై ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రమేష్ కార్మికుల సమస్యలపై రమేష్ చేసిన పోరాటాలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి, అంగన్వాడీ యూనియన్ నాయకులు వివి.రమణమ్మ, వసంత, పలువురు ముఠా కార్మికులు పాల్గొన్నారు.

నక్కపల్లి: స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద కార్మిక ఉద్యమ నేత కామ్రేడ్ ఎస్.రమేష్ 5వ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. కామ్రేడ్ రమేష్ చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు, నాయకులు వాతాడా అప్పారావు, పిల్లి తాతారావు తదితరులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం అప్పలరాజు మాట్లాడుతూ, ఉమ్మడి విశాఖ జిల్లాలో కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు చేసిన రమేష్ చేశారని, ఆయన లేని లోటు కార్మిక వర్గానికి తీవ్ర నష్టం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మనబాల రాజేష్, దండుబాబు, వీరన్న, కార్మికులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో...

మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి శ్రీనివాస్

వరిలో సుడి దోమపై జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి- చీడికాడ: వరిలో సుడిదోమ తెగులుపై రైతులు జాగ్రత్తలు పాటించాలని, లేదంటే పొలం పూర్తిగా దెబ్బతింటాయని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని బైలిపూడి గ్రామంలో వరి పొలాలను సందర్శించారు. ఆయన రైతులతో మాట్లాడుతూ, ఈ తెగులుతో వరి దుబ్బులు గోధుమ రంగులోకి మారి, మొక్కలు వడలి సుడులు సుడులుగా ఎండి పోతాయన్నారు. వీటి నివారణకు సుడిదోమ ప్రారంభ దశలో ఉంటే ఎకరానికి 300 గ్రాముల ఎస్పెట్ మందు నీటిలో పిచికారి చేసి ఎకరానికి 12 ట్యాంకులు చొప్పున స్ప్రే చేయాలన్నారు. మధ్యస్థ దశలో ఉంటే ఎస్పెట్ 300 గ్రామ్స్ తో పాటు బఫ్రో ఫెజిన్ 330 ఎమ్మెల్ ఎకరానికి పిచికారి చేసి స్ప్రే చేయాలన్నారు. సుడిదోమ తీవ్రత ఎక్కువగా ఉంటే ఎస్పెటతో పాటు పైమెట్రో జెన్ 120 గ్రామ్స్ నీటిలో పిచికారి చేసి ఎకరాకి 12 ట్యాంకుల చొప్పున స్ప్రే చేయాలన్నారు. ముఖ్యంగా పిచికారి స్ప్రే ఉదయం 10 లోపు, మధ్యాహ్నం మూడు గంటలు తర్వాత చేయాలని సూచించారు.

అభినందనలు తెలుపుతున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

అధ్యాపకునికి అభినందనలు

ప్రజాశక్తి-మాడుగుల: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఆంగ్ల భాష అధ్యాపకులు బి.నారాయణకు ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులు అభినందనలు తెలిపారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఆదివారం విడుదల చేసిన నేషనల్ ఎలిజి బిలిటీ టెస్ట్‌లో ఇంగ్లీష్ లిటరేచర్‌లో ఆయన అర్హత సాధించారు. ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లోను అర్హత పొందారు. దీంతో సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయనకు సత్కారం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ సివిఎస్ఎస్ శాస్త్రి, అధ్యాపకులు షర్మిల, పైడిరాజు, రాజు, సులోచన, ఆర్ వి రమణ మూర్తి, రామ్ కుమార్, బోధనేతర సిబ్బంది సులేమాన్, అన్నపూర్ణ, శ్రీనివాస్ పలువురు విద్యార్థులు అభినందనలు తెలిపారు.

ఆలయాలు కిటకిట

ప్రజాశక్తి-రావికమతం: కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా చినపాచిల కోదండరామ ఆలయంలో సోమవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలైన గుమ్మాలపాడు, ఎర్రబంద, కొమిరా, అగ్రహారం, తదితర గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చారు.

గొలుగొండ: కార్తీక మాసం కావడంతో మండలంలోని దారమఠం శివాలయం భక్తులతో సోమవారం కిటకిటలాడింది. తెల్లవారుజాము నుండి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జలపాతాల వద్ద భక్తులు స్నానాలు ఆచరించి పూజలు చేశారు. అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు.

పూజలు నిర్వహిస్తున్న భక్తులు

విధులకు డుమ్మా కొట్టిన

పప్పుశెట్టిపాలెం సచివాలయ సిబ్బంది

▶▶ 12 గంటలైనా విధులకు రాని వైనం ▶▶ గంటల తరబడి వేచివున్న ప్రజలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పప్పుశెట్టిపాలెం గ్రామ సచివాలయం సిబ్బంది సోమవారం విధులకు డుమ్మా కొట్టారు. మధ్యాహ్నం 12 గంటలైనా ముగ్గురు మినహా ఎవరూ సిబ్బంది విధులకు హాజరు కాలేదు. వివిధ సమస్యలపై వచ్చిన ప్రజలు బయటే ఉండిపోయారు. ఉదయం 10.30 గంటలకు గ్రామ సచివాలయంకు రావాల్సిన సిబ్బంది 12 గంటలైనా రాక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ విజయలక్ష్మి వచ్చి గ్రామ సచివాలయంను సందర్శించారు. గ్రామ సచివాలయం లో 11 మంది సిబ్బంది విధులు నిర్వహించడం జరుగుతుంది. ముగ్గురు సిబ్బంది సమయంకు వచ్చినా గ్రామ సచివాలయం తాళాలు లేక పోవడంతో వచ్చిన సిబ్బంది కూడా బయట ఉండిపోవాల్సి వచ్చింది. సిబ్బంది సమయపాలన తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని సర్పంచ్ తెలిపారు. ఈ విషయంలో ఇన్‌చార్జ్ ఈఒఆర్‌డి రఘును సంప్రదించగా సిబ్బందికి మెమో ఇవ్వడంతో పాటు చర్యలు తీసుకుంటామన్నారు.

సచివాలయం బయట కూర్చున్న ప్రజలు

ప్రశంసాపత్రం ఇస్తున్న ఎస్పీ

ఎస్ఐ నాగకార్తీక్‌కు రివార్డు

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని పడాలపాలెం బాలుడి హత్య కేసును ఎంతో చాకచక్యంగా చేధించడంతో ఎస్సై నాగకార్తీక్ జిల్లా ఎస్పీ ఎంఎస్.గౌతమిశాలి చేతులమీదుగా ప్రశంసాపత్రం, రూ.10వేల రివార్డును అందుకు న్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లా డుతూ, తనతో పాటు మిగతా 10 మంది సిబ్బందికి ప్రశంసాపత్రాలు, రివార్డు అందజేయడం జరిగిందన్నారు.